నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్



## కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గుమ్మెన కొలాంగూడ గ్రామస్తులు

నిర్మల్ అర్బన్, మే 7 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం పెంబి మండలంలోని గుమ్మెన కొలాంగూడా గ్రామస్తులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. తమ గ్రామానికి తాగు నీరు, సీసీ రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. అర్హులైన వారందరికీ డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వేతనాల కోసం ఆందోళన




నినాదాలు చేస్తున్న సిబ్బంది

ఉట్నూర్, మే 7 : ఉట్నూర్ జిల్లా ఆసుపత్రిలో వైద్యసిబ్బంది మూడో రోజైన బుధవారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాష్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు పనిచేస్తున్న సరైన సమయంలో వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటి వరకు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలు ఇవ్వాలని పేర్కొన్నారు. దీంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది భాను, అమర్ సింగ్, వెంకటేశ్, మొయిన్, అరుణ్, గంగాధర్, వీణ, యశోద, రమ, అంజలి పాల్గొన్నారు.

## కేటీఆర్ చొరవతో స్వగ్రామానికి రెడ్డి నాయక్





పెంబి, మే 7 : హైదరాబాద్‌లో ఎప్‌సెట్ పరీక్ష రాసి తిరిగొస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అక్కాచెల్లెళ్లు మంజుల(17), అశ్విని(19)ల తండ్రి రెడ్డి నాయక్ బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహాయంతో బుధవారం స్వగ్రామానికి చేరుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని లోతోర్యతాండకు చెందిన బానవత్ రెడ్డి ఆరేండ్ల క్రితం మలేషియా వెళ్లాడు. ఇతనికి భార్య, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. మలేషియాలో ఇతను పని చేస్తున్న కంపనీ మోసం చేయడంతో అక్కడే చిక్కుకున్నాడు. మే 1న ఎప్‌సెట్ పరీక్ష రాసి హైదరాబాద్ నుంచి తిరిగి వస్తుండగా నిజామాబాద్ జిల్ల జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్ గ్రామం వద్ద అతని కూతుళ్లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మలేషియాలో చిక్కుకున్న తన తండ్రికి చివరి చూపు కూడా దక్కలేదు. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న కేటీఆర్ స్పందించి అండగా నిలిచారు. రెడ్డి నాయక్‌ను స్వగ్రామానికి తీసుకురావడానికి భారత దౌత్య అధికారులను సమన్వయం చేసి ప్రయాణ అనుమతులు, అక్కడి కంపెనీకి రూ.1.20 లక్షలు చెల్లించి పాస్ పోర్ట్ ఇప్పించాడు. అలాగే జాన్సన్ నాయక్ విమాన టికెట్ ఖర్చులకు రూ. 30 వేలు అందించడంతో బుధవారం స్వగ్రామానికి చేరుకున్నాడు. బుధవారం లోతోర్యతాండ గ్రామానికి చెరుకుని కుటుంబ సభ్యులను కలుసుకున్నాడు.



### ❖ కేటీఆర్‌కు రుణపడి ఉంటాం..

నేను మలేషియా వెళ్లి ఆరేండ్లు అయ్యింది. నేను పని చేస్తున్న కంపెనీ సక్రమంగా వేతనాలు ఇవ్వకపోవడంతోపాటు నా పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకున్నది. దీంతో మలేషియాలో భయపడుకుంటూ భయటే పనులు చేసుకున్నా. నా కూతుళ్లు రోడ్డు ప్రమాదంలో చనిపోయారని తెలిసింది. కానీ.. ఇండియాకు రాలేని పరిస్థితి ఏర్పడింది. గత ఆదివారం అనుకోకుండా కేటీఆర్ సారు ఫోన్ చేసి 'నిన్ను ఇండియాకు తీసుకొస్తా.. బాధపడకు..' అని భరోసా ఇచ్చాడు. ఇచ్చిన మాట ప్రకారం.. నేను పని చేసిన కంపెనీతో మాట్లాడి ఫెనాల్టీ కట్టి నా పాస్‌పోర్ట్ ఇప్పించాడు. అలాగే జాన్సన్ నాయక్ విమాన టికెట్‌కు డబ్బులు పంపించాడు. జీవితాంతం కేటీఆర్, జాన్సన్ నాయక్‌కు రుణపడి ఉంటా.

**- బానవత్ రెడ్డి నాయక్**



# ఉపాధి కూలీలకు సౌకర్యాలు కరువు

## ఆదిలాబాద్ జిల్లాలో మండుటెండలు

## పని ప్రదేశంలో మంచి నీళ్లు, నీడ లేదు..

ఆదిలాబాద్, మే 7(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో వ్యవసాయ సీజన్ ముగియడంతో ఉపాధి పనులు చేసే కూలీల సంఖ్య పెరిగింది. అధికారులు ముందస్తు ప్రణాళికలు రూపొందించి కూలీలకు పనులు కల్పిస్తున్నారు. జిల్లాలో 468 గ్రామ పంచాయతీల్లో 1,14,409 జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 85 వేల మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. వ్యవసాయ పనులు లేకపోవడంతో పనులు చేసే వారు సంఖ్య అధికంగా ఉంటుంది. ఎండాకాలం కావడంతో చల్లగా ఉండే సమయాల్లో ఉదయం, సాయంత్రం కూలీలు పనులకు వెళ్తుంటారు. ఎండ ఎక్కువగా ఉండే మధ్యాహ్నం వడదెబ్బ తగలకుండా కూలీలు ఇంటి వద్ద ఉంటారు.

### సౌకర్యాలు కరువు

ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలకు సిబ్బంది సౌకర్యాలు కల్పించాలి. తాగు నీరు, నీడ వసతి ఏర్పాటు చేయడంతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. జిల్లాలో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, వడగాలులు వీస్తున్నాయి. జనం ఎండ వేడిని తట్టుకోలేక సతమతమవుతున్నారు. ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాలు లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. నీడలేక పోవడంతో చెట్ల కింద సేదతీరుతున్నారు. మంచినీటిని కూడా ఇంటి నుంచి తెచ్చుకుంటూ పనులు చేసుకుంటున్నారు. ఇంటి నుంచి బాటిళ్లలో తెచ్చుకున్న నీరు కొద్దిసేపటికే వేడి అవుతుందని, ఉపాధి సిబ్బంది టెంట్‌లు ఏర్పాటు చేయకపోవడంతో కొన్ని చోట్ల చెట్టు నీడ లేక ఇబ్బందులు పడుతున్నామని ఉపాధి కూలీలు అంటున్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ బారిన పడకుండా సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

### ❖ ఇంటి నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నాం..



గ్రామంలో చాలా మంది ఉపాధి కూలీలు కుంటలో పనులు చేస్తున్నారు. రోజు ఉదయం 100 మందికి పైగా పనికి వస్తారు. ఎండాకాలం కావడంతో పనిచేసిన కొద్ది సేపటికే దాహం వేస్తుంది. దీంతో మంచినీరు ఎక్కువగా తాగుతాం. చెమట వల్ల నీరు అవసరం ఎక్కువగా ఉంటంది. కూలీలు పనిచేసే దగ్గర మంచినీటి సౌకర్యం లేదు. దీంతో రోజు ఇంటి వద్ద నుంచి బాటిళ్లలో నీళ్లు తెచ్చుకుంటున్నాం. ఈ నీళ్లు కూడా సరిపోతలేవు. తొందరగా అయిపోతున్నాయి. దీంతో తాగునీళ్లకు ఇబ్బంది అవుతున్నది. నీడ కూడా లేకపోవడంతో చెట్ల కింద సేద తీరుతున్నాం. అధికారులు మాకు మంచి నీళ్లు, నీడ సౌకర్యం కల్పించాలి.

**- రాధ, ఉపాధి కూలీ, పొన్నారి, తాంసి మండలం**



ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన ధాన్యం



దస్తురాబాద్ : రాంపూర్‌లో నెలకొరిగిన వరి పైరు



కడెం : పెద్దబెల్లాల్‌లో..

# అకాల వర్షం.. తడిసిన ధాన్యం

కడెం, మే 7 : అకాల వర్షంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోజులుగా భారీ ఈదురుగాలులతోపాటు వర్షం కురుస్తున్నది. దీని కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షంతో ధాన్యం తడుస్తుండగా కవర్లు కప్పి కాపాడుకునే ప్రయత్నం చేసినప్పటికీ గాలులతో కవర్లు కొట్టుకుపోతున్నాయి. బుధవారం తెల్లవారుజామున ఈదురుగాలులతోపాటు భారీ వర్షం కురిసింది. దీంతో ధాన్యం తడిసి ముద్దయింది. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని ఆరబెట్టారు. ఇదిలా ఉండగా, పెద్దబెల్లాల్‌లో ఇప్పటికి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదు. గతంలో గిరిజన సహకార సంఘం(జీసీసీ) కేంద్రం ఉండేది. ఇదే విషయమై 'నమస్తే తెలంగాణ' జీసీసీ నిర్వాహకులను అడుగగా.. స్పందన లేదు.

### రైతుల అరిగోస

ఖానాపూర్, మే 7 : ఖానాపూర్ పట్టణంలో మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురియడంతో వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. అన్నదాత అరుకాలం కష్టించి పండించిన పంట నేలపాలైందని రైతులు వాపోయారు. వాతావరణ మార్పుల వల్ల తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని జాప్యం చేయకుండాకొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు డిమండ్ చేస్తున్నారు.

### నేల కొరిగిన పంట

దస్తురాబాద్, మే 7 : మండల కేంద్రంతోపాటు, పలు గ్రామాల్లో బుధవారం వేకువజామున ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వరి పైరు దెబ్బతిని నెలకొరిగింది. అధికారులతో సర్వే చేయించి పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తూకం వేసి రైసు మిల్లులకు తరలించాలని రైతులు కోరుతున్నారు. విద్యుత్ సరఫరాలలో కూడా అంతరాయం ఏర్పడింది.


### ❖ ఇప్పటికీ కేంద్రాన్ని ఏర్పాటు చేయలే..



మేము వరి కోసి రెండు వారాలు గడిచింది. రోజు మా వడ్లను ఆరబెట్టి కవర్లు కప్పుతున్నాం. నాలుగు రోజులుగా ఈదురుగాలులు, వర్షాలతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికి మా దగ్గర కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులు వరి కోతలు ప్రారంభం కాకముందే కేంద్రాలు ప్రారంభమయ్యేవి. కవర్లు అందించి, ధాన్యాన్ని తడవకుండా రక్షించేవారు. ఇప్పుడు మేము అడిగిన కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదు. మా గ్రామంలో కేంద్రాన్ని ఏర్పాటు చేసి, కొనుగోళ్లు ప్రారంభించి ఆదుకోవాలి.

**- సురేందర్, రైతు, పెద్దబెల్లాల్, కడెం**

### ❖ వారం దాటిన తూకం వేయలే..



ఖానాపూర్ మండలంలోని తర్లపాడు గ్రామంలో జన్నారం జీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసి వారం రోజులు అయింది. కేంద్రం నిర్వాహకులు తేమ శాతం వచ్చిందని చెప్పి గన్నీ బ్యాగులు ఇచ్చారు. ఇప్పటికీ తూకం వేయలేదు. రైతులకు కనీస మౌలిక వసతులు కూడా లేవు. మంగళవారం రాత్రి కురిసిన వానకు వడ్లన్నీ తడిసినయ్. రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా తేమ వచ్చినా వెంటనే కొనుగోలు చేయాలి.

**- గజ్జెల భూమరాజు, మహిళా రైతు, తర్లపాడు**

# కొనుగోళ్లలో అలసత్వం తగదు



అందకూర్‌లోని కొనుగోలు కేంద్రం వద్ద రైతుల సమస్యలను వింటున్న కలెక్టర్ అభిలాష అభినవ్

- ధాన్యం ఎక్కువ తూకం వేస్తున్నారని ఫిర్యాదు
- కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కల్పించని అధికారులు
- అలసత్వంపై కలెక్టర్ మండిపాటు
- పీఏసీఎస్‌కు రూ.2 లక్షల జరిమానా
- సిబ్బందిపై కఠిన చర్యలకు ఆదేశం
- కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ

కుంటాల, మే 7 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని, రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం అందకూర్, కుంటాలలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి, జొన్న కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల్లో టెంట్, తాగునీటి వసతులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వాహకుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ కొనుగోలు ప్రక్రియలో అలసత్వం కారణంగా రూ.2 లక్షల జరిమానా విధించారు. అన్ని రిజిస్టర్లను పరిశీలించిన అనంతరం ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గజ్జారాం పాల్గొన్నారు.

# మహారాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

**20 గ్రాముల బంగారం, 28 తులాల వెండి వస్తువులు స్వాధీనం**



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఎదులాపురం, మే 7 : ఏప్రిల్ 28వ తేదీన ఆదిలాబాద్ పట్టణంలోని మూడిండ్లలో దొంగతనం చేసిన మహారాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో వివరాలను సీఐ కరుణాకర్ రావుతో కలిసి వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలో గత నెల 28, 29వ తేదీల్లో చిలుకూరి లక్ష్మీనగర్, మహాలక్ష్మి వాడలలో దొంగతనాలు జరిగాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాం. సీసీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేశాం. నిఘా వర్గాల సమాచారం మేరకు బుధవారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్ సమీపంలో మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా చండీపురాకు చెందిన షేక్ మోబిన్, యవత్మాల్ జిల్లా వాడ్గావ్ గ్రామంలోని శాంతినగర్‌కు చెందిన వాడే ఆకాశ్, ధాలవ్ఫలా ఫారోజ్‌కు చెందిన షిండే ఆకాశ్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 20 గ్రాముల బంగారు గాజులు, 28 తులాల వెండి సామగ్రితోపాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో సీసీఎస్ సీఐ సిహెచ్ చంద్రశేఖర్, ఎస్సై విష్ణుప్రకాశ్ పాల్గొన్నారు.

## అంధకారంలో గోట్కూరి వీధులు



గోట్కూరి పురవీధుల్లో అంధకారం



లో వోల్టేజీతో చెడిపోయిన కూలరు

తాంసి, మే 7 : గోట్కూరి గ్రామంలో వారం రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో గ్రామవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళ ప్రధాన రహదారులు, వీధులు అంధకారంలో మునిగి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారికి విన్నవించిన పట్టించుకోవడం లేదు. లో-వోల్టేజీ కారణంగా ఇండ్లలో ఫ్రిడ్జ్‌లు, కూలర్లు, మోటార్లు చెడిపోతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.